# నేటిధాత్రి ®

నిర్భయమైన వార్తల నిజరూపం

CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES



## పరాయి పెత్తనం ... ఎప్పటికైనా మోసమే?

- ప్రకాశ్‌రాజ్‌కు తెలుగు సినిమా ఇవ్వాల్సినదానికన్నా ఎక్కువే ఇచ్చింది?
- తెలుగు కళామతల్లి రుణం తీర్చుకున్నారా?
- గతంలో ఏనాడైనా మాలో ఓటు వేశాడా ప్రకాశ్‌రాజ్




రేపటి మీ నేటిధాత్రి దినపత్రికలో



వరంగల్ బుధవారం 06-10-2021 సంపుటి : 17 సంచిక : 157 పేజీలు : 04 రూ|| 3.00


# ప్రాణం తీసిన ప్రమాదం

- మంథని-కాటారం ప్రధాన రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం
- ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సు , కారు
- ప్రమాదంలో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి
- ప్రమాదంతో రోడ్డు నుండి లోయవైపు దూసుకెళ్లిన వాహనాలు
- బస్సులో ఉన్న 11 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం
- క్షతగాత్రులను గొదావరిఖని సింగరేణి ఆస్పత్రికి తరలింపు
- మృతుడు మంథని కార్‌కేర్‌లో మెకానిక్
- ఘటనపై విచారం వ్యక్తం చేసిన మంత్రి పువ్వాడ



మృతుడు వినోద్

పెద్దపల్లి ,నేటిధాత్రి: పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామ శివారులోని గాడుదుల గండి గుట్ట వద్ద మంథని-కాటారం ప్రధాన రహదారిపై గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో బెల్లంపల్లి నుంచి హనుమకొండకు వెళుతున్న పరకాల డిపో బస్ ఏపీ 36జెడ్ 0161 మంథని వైపుకు వస్తున్న కారు టీఎస్ 04ఎఫ్ సీ 9774ను ఢీ కొట్టి బస్ లోయలో పడిపోయింది. ఈ ఘటనలో రెండు వాహనాలు అదుపుతప్పి పక్కనే ఉన్న చిన్నపాటి లోయలోకి దూసుకెళ్లాయి. ప్రమాదంలో మంథని మండలం ఖాన్‌సాయిపేటకు చెందిన కారు డ్రైవర్ వినోద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమయంలో బస్సులో 13 మంది ప్రయాణికులు ఉండగా 11 మందికి గాయాలయ్యాయి. ఇందులో తీవ్రంగా గాయపడిన భూపాలపల్లికి చెందిన లక్ష్మి, మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన సోఫియా, శ్వేత, మరియా, అంజయ్యను మెరుగైన చికిత్స కోసం గోదావరిఖనిలోని సింగరేణి ఆస్పత్రికి తరలించారు. వీరిలో లక్ష్మి, మరియా పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మంథని మండలం ఖాన్ సాయిపేట్ గ్రామానికి చెందిన మృతుడు వినోద్ మంథనిలో కార్ కేర్ సెంటర్‌లో మెకానిక్‌గా పని చేస్తున్నాడు.

**మంత్రి పువ్వాడ విచారం**

లోయలో పడిన బస్సు దుర్ఘటనపై మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బెల్లంపల్లి నుంచి హనుమకొండ వెళ్తున్న బస్సు ప్రమాదవశాత్తు లోయలో పడటం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కరీంనగర్, వరంగల్ రీజినల్ మేనేజర్లకు మంత్రి ఆదేశించారు. క్షతగాత్రులకు కావల్సిన వైద్య సేవల కోసం సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. గాయాలకు గురైన ప్రయాణీకులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ బాధిత కుటుంబసభ్యులకు తమ విచారం వ్యక్తం చేశారు.

# కీలక నిందితుడు సాయికుమార్

## తెలుగు అకాడమి కేసులో వివరాలు వెల్లడించిన సీపీ అంజన్ కూమార్



హైదరాబాద్,నేటిధాత్రి: తెలుగు అకాడమీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల కుంభకోణానికి సంబంధించి ప్రత్యేక బృందం ద్వారా దర్యాప్తు చేపట్టినట్లు హైదరాబాద్ సీపీ అంజనీ కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాడమీ అకౌంట్స్ అధికారి రమేశ్‌కు అక్రమాలకు పాల్పడిన ముఠాతో సత్సంబంధాలు ఉన్నట్లు తెలిపారు. గతంలో కొందరిని అరెస్టు చేశామన్నారు. మరో 9 మందిని అనుమానితులుగా భావిస్తున్నట్లు చెప్పారు. వారి వివరాలను త్వరలో వెల్లడిస్తామని వివరించారు. "మొత్తం రూ. 64.5 కోట్ల నిధులు గోల్‌మాల్ చేశారు. కార్వాన్‌లోని యూనియన్ బ్యాంక్ నుంచి 26కోట్లు, రూ. 11 కోట్లు సంతోష్ నగర్, చందనగర్ కెనరా బ్యాంక్‌లోని రూ. 6 కోట్లు కొల్లగొట్టారు. ఈ కుంభకోణంలో సాయికుమార్ కీలక నిందితుడు. ఇతనిపై గతంలో 3 కేసులున్నాయి" అని అంజనీకుమార్ తెలిపారు. కాగా, ఇవాళ సీసీఎస్ పోలీసులు బ్యాంకు ఏజెంట్లు సాయికుమార్, రాజ్‌కుమార్, వెంకట్‌తో పాటు చందానగర్ కెనరా బ్యాంకు మేనేజర్ సాధనను అరెస్టు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచే ఫిక్స్‌డ్ డిపాజిట్లను ముఠా మళ్లించినట్లు తేల్చారు. ఒప్పందం ప్రకారం పంచుకున్నారు.. "డబ్బులన్నీ అగ్రసేన్ బ్యాంకు కోఆపరేటివ్ సొసైటీ ఖాతాలోకి వెళ్లాయి. అకాడమీ సభ్యుల లాగా అగ్రసేన్ బ్యాంక్‌లో ఖాతాలు తెలిచారు. సాయి కుమార్‌కి ఈ డబ్బులో అధిక శాతం వెళ్లాయి. మిగిలిన వారు ఒప్పందం ప్రకారం పంచుకున్నారు. కొంత నగదును ఖాతాల్లో నిలుపుదల చేశాం. పంచుకున్న డబ్బులతో నిందితులు ఆస్తులు కొన్నారు. కొంతమంది అప్పులు ఇచ్చారు. మార్కంటైల్ బ్యాంక్‌కు 10శాతం కమిషన్ వెళ్లింది" అని సీసీఎస్ జాయింట్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు.

# కరోనా ముగిసిందని నటిస్తున్నారు

## తప్పుడు సమాచారం ప్రజల్ని చంపేస్తోందన్న ఆరోగ్య సంస్థ



డెస్క్,నేటిధాత్రి: : కరోనా మహమ్మారి ముగిసిపోయిందని కొందరు భావిస్తున్నారని, కానీ దాన్నుంచి ఇంకా బయటపడలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. గత వారం 31 లక్షల మందికి కరోనా సోకిందని, 54 వేల మరణాల సంభవించాయని వెల్లడించింది. వాస్తవంగా ఆ లెక్కలు మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని కూడా ఆందోళన వ్యక్తం చేసింది.

'కరోనా ముప్పు ఇంకా పొంచి ఉంది. మనకు వైరస్‌పై నియంత్రణ రాలేదు కాబట్టే.. ఈ ముప్పు కొనసాగుతోంది. మహమ్మారికి చరమగీతం పాడేందుకు మనవద్ద ఉన్న సాధనాలను సరిగా వినియోగించుకోవడంలేదు. కొన్ని ప్రాంతాల్లో ఐసీయూలు, ఆసుపత్రులు నిండిపోతున్నాయి. ప్రజలు చనిపోతున్నారు. కానీ కొందరు మాత్రం కరోనా ముగిసిపోయిందని నటిస్తూ, తిరిగేస్తున్నారు' అని ఆరోగ్య సంస్థకు చెందిన మారియా వ్యాన్ కెర్కోవ్ ఆందోళన వ్యక్తం చేశారు.

దాదాపు రెండేళ్ల కాలంలో సుమారు 50 లక్షల మంది కరోనా కాటుకు బలయ్యారు. కరోనా టీకా తీసుకోని వ్యక్తుల్లోనే మరణాలు సంభవిస్తున్నాయని మారియా వెల్లడించారు. ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితి, మరణాల రేటు.. టీకా తీసుకోని వారిలోనే ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. కరోనా వైరస్, టీకా గురించి నెట్టింట్లో చక్కర్లు కొడుతోన్న తప్పుడు సమాచారం తీవ్ర ప్రభావం చూపుతోందని అసహనం వ్యక్తం చేశారు. అది ప్రజల మరణాలకు కారణమవుతోందని వాపోయారు. అలాగే అంతర్జాతీయ సమాజం వైరస్‌పై వీలైనంత ఎదురుదాడి చేయలేదని గుర్తు చేశారు.

# రాహుల్‌ను అడ్డుకున్న పోలీసులు



డెస్క్,నేటిధాత్రి: లఖింపుర్ ఖేరి ఘటనలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు యూపీ ప్రభుత్వం అనుమతినిచ్చినా.. యూపీ పోలీసులు తమను ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వెళ్లనివ్వడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. సొంత వాహనంలో లఖింపుర్ వెళ్లేందుకు అనుమతి ఇవ్వట్లేదన్న ఆయన.. విమానాశ్రయంలో ధర్నా చేపట్టారు. దీంతో లఖ్‌నవూ ఎయిర్‌పోర్టులో హైడ్రామా నెలకొంది. లఖింపుర్ ఖేరి వెళ్లేందుకు రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెస్ నేతల బృందం ఈ మధ్యాహ్నం లఖ్‌నవూ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా ఘటనాస్థలానికి వెళ్లాలని భావించింది. ఇందుకోసం తమ సొంత వాహనాన్ని ఉపయోగించుకుంటామని కాంగ్రెస్ నేత చెప్పగా.. పోలీసులు అందుకు అంగీకరించలేదు. పోలీసు వాహనంలోనే వెళ్లాలని చెప్పారు. దీంతో పోలీసులు, ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బందితో రాహుల్ వాగ్వాదానికి దిగారు. "నాకు వాహనం ఏర్పాటు చేయడానికి మీరెవరు? ఏ రూల్ ప్రకారం మీరు నా ప్రయాణాన్ని నిర్ణయిస్తున్నారు? నేను నా కారులోనే వెళ్తాను" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు పోలీసులు అంగీకరించకపోవడంతో ఎయిర్‌పోర్టులోనే ధర్నా చేపట్టారు. "నన్ను ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వెళ్లనివ్వట్లేదు. ఇదేనా మీరు నాకు ఇచ్చిన అనుమతులు? యూపీ ప్రభుత్వం అనుమతులు ఎలా ఉన్నాయో చూడండి" అంటూ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన వాహనంలోనే వెళ్లేందుకు పోలీసులు అనుమతించారు. దీంతో రాహుల్ తన వాహనంలోనే లఖింపుర్ బయల్దేరారు.

# మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు




న్యూఢిల్లీ,నేటిధాత్రి: పెట్రో ధరల పెంపు కొనసాగుతూనే ఉన్నది. మంగళవారం లీటరు పెట్రోల్‌పై 25 పైసలు, డీజిల్‌పై 30 పైసలను పెంచిన దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు.. మరోమారు వినియోగదారులపై భారం మోపాయి. తాజాగా పెట్రోల్‌పై 30 పైసలు, డీజిల్‌పై 35 పైసలు వడ్డించాయి. దీంతో ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర 102.94కు చేరగా.. డీజిల్ ధర రూ. 91.42కు పెరిగింది. అలాగే ముంబైలో పెట్రోల్ ధర రూ. 108.96కు ఎగబాకగా, డీజిల్ ధర రూ. 99.17కి చేరుకుంది. తాజా పెంపుతో హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ. 107.08కి పెరగగా, డీజిల్ ధర రూ. 99.75కు చేరింది. ఇక కోల్‌కతాలో పెట్రోల్ రూ. 103.65, డీజిల్ రూ. 94.53, చెన్నైలో పెట్రోల్ రూ. 100.49, డీజిల్ రూ. 95.93కు చేరింది.

# మోదీ భావోద్వేగ రాజకీయాలు

## ఎమ్మెల్యే, కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి



హైదరాబాద్,నేటిధాత్రి: కులమతాల పేరుతో భాజపా రెచ్చగొట్టే రాజకీయం చేస్తోందని సంగారెడ్డి ఎమ్మెల్యే, కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. మోదీ ప్రధాని అయ్యాక భావోద్వేగ రాజకీయాలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ చట్టాలను తీసుకురావడం ద్వారా కేంద్ర ప్రభుత్వం.. రైతుల నడ్డి విరుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర భారతంలో 200 రోజులుగా రైతులు ఉద్యమం చేస్తుంటే భాజపా ప్రభుత్వంలో చలనం రాదా? అని ప్రశ్నించారు. రైతు కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్న ప్రియాంక గాంధీని అరెస్టు చేశారని.. ఇదేం ప్రజాస్వామ్యమని నిలదీశారు. ప్రియాంక గాంధీని వెంటనే విడుదల చేయకపోతే తామంతా రోడ్ల మీదికి రావాల్సి ఉంటుందని.. సంగారెడ్డి నుంచి ఉద్యమం పెదలు పెడతానని హెచ్చరించారు.

# సంస్కృతిని భావితరాలకు అందించాలి



కాజీపేట, నేటిధాత్రి: మన సంస్కృతి, ఆచార సంప్రదాయాలను భావితరాలకు అందించాలని సీనియర్ ఉపాధ్యాయురాలు జి. వాణిశ్రీ కోరారు. 4వ డివిజన్ లోని రెడ్డికాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో మన సంస్కృతి పరిరక్షణకై ఇటువంటి వేడుకలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అంతకుముందు బతుకమ్మలను తయారు చేసి బడికి తీసుకువచ్చిన విద్యార్థినులకు ఆమె బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎమ్డీ. అజార్ హుస్సేన్, శమంతకమణి, ఎస్ఎంసీ చైర్మన్ గౌసియోద్దీన్, డాక్టర్ పావుశెట్టి శ్రీదర్, స్టాఫ్ సెక్రటరీ పెరుమాండ్ల సాంబమూర్తి, ఉపాధ్యాయులు అనిత, ప్రవీణారెడ్డి, స్వాతి, సరిత, మనోహర్, సతీష్, మధుసూదన్, విద్యాసాగర్, మహేందర్, జనార్దన్ రెడ్డి, విద్యార్థినులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రక్రియ పారదర్శకంగానే జరిగింది

## మా ఎలక్షన్ అథారిటీ

డెస్క్,నేటిధాత్రి: మరో నాలుగురోజుల్లో మా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. మంచు విష్ణు ప్యానల్, ప్రకాశ్ రాజ్ ప్యానల్ తమ తమ ప్రచారాలు చేసుకుంటూనే.. ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు, మాటల యుద్ధం చేసుకుంటూ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. ఇటీవల ప్రకాశ్ రాజ్ .. పోస్టల్ బ్యాలెట్ విధానంలో కుట్రలు జరుగుతున్నాయని మంచు విష్ణు ప్యానల్ కుట్ర పూరితంగా వ్యహరిస్తోందని ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఆరోపణలకు ఎలక్షన్ అథారిటీ పూర్తి క్లారిఫికేషన్ ఇస్తూ ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ఇటీవల కొందరు అభ్యర్థులు ఆరోపించిన కారణంగా, దీనిపై ఎలక్షన్ అథారిటీ పూర్తి క్లారిఫికేషన్ ఇస్తోందని, ఈ విషయంలో ఎలాంటి భయాలు పెట్టుకోవద్దని, తాము పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఇందులో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలు పూర్తిగా నిరాధారాలని తెలిపింది. పోస్టల్ బ్యాలెట్స్ ఓటర్స్ కు బ్లూ డార్ట్ కొరియర్ ద్వారా నిన్ననే పంపామని చెప్పారు. రిగ్గింగ్ కు అవకాశం లేకుండా.. ఈ ఎలక్షన్స్ కోసం వెరిఫికేషన్ స్లిప్ విధానాన్ని పరిచయం చేస్తున్నామని, ఈ ఎలక్షన్స్ ప్రక్రియ అంతా కట్టుదిట్టంగా, పూర్తి భద్రతతో నిర్వహిస్తున్నామని ఎలక్షన్ అథారిటీ క్లారిఫికేషన్ ఇచ్చింది.

# పద్మశాలీలంతా టీఆర్ఎస్ వైపే



హుజూరాబాద్,నేటిధాత్రి: ఉప ఎన్నికలో పద్మశాలీలంతా టీఆర్ఎస్‌కు అండగా ఉంటారని, ప్రజా సంక్షేమం కోసం పరితపించే టీఆర్ఎస్‌కే ఓటు వేస్తామని పద్మశాలి అఖిలభారత సంఘం నాయకులు చెప్పారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కలిసి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్ గెలుపునకు పద్మశాలీలు ఏకం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మ్యాడం బాబురావు, ఉపాధ్యక్షులు వడ్నాల నరేందర్, సునీల్, కర్నాటి శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు గుండేటి సతీశ్ ఉన్నారు. టీఆర్ఎస్ పార్టీకి మద్దతు ప్రకటించిన పద్మశాలి కుల బంధువులకు మంత్రి హరీశ్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

www.netidhatri.com

నిష్పక్షపాతమైన వార్తల నిజరూపం

నేటిధాత్రి ®

Webportal

You Tube

జర్నలిస్టులకు

ఆహ్వానం



నిజాల నిప్పు కణం–

వాస్తవాల దృశ్య రూపం

'నేటిధాత్రి' టీవీలో పనిచేయుటకు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా

అన్ని ప్రాంతాల నుంచి విలేకరులు కావలెను.

జర్నలిజం మీద ఆసక్తి, అనుభవజ్ఞులైన వారు

సంప్రదించగలరు





కట్టా రాఘవేంద్రరావు

సీఈవో-నేటిధాత్రి టీవీ

8297779999, 9908658888

